క్లుప్తంగా

జీడిపిక్కలను ఐటీడీఏ కొనుగోలు చేయాలి


మాట్లాడుతున్న బూర్గులయ్య

కొయ్యూరు: మండలంలో దిగుబడి అయిన జీడిపిక్కలను పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని జీడిరైతుల సంక్షేమ సంఘం మండల కన్వీనర్ మాకాడ బూర్గులయ్యా కోరారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారులు కుమ్మక్కై ధరను తగ్గిస్తుండడంతో జీడి రైతులు నష్టపోతున్నారని చెప్పారు. వ్యాపారులు రోజురోజుకు ధరను తగ్గిస్తున్నారని తెలిపారు. దీంతో పంట సాగుకు అధిక వడ్డీలకు అప్పులు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. పాడేరు ఐటీడీఏ జీడి రైతులను ఆదుకోవాలని, కిలో రూ.150 చొప్పున కొనుగోలు చేయాలని కోరారు. సర్పంచ్ మాకాడ బాలరాజు, సభ్యులు జగ్గారావు,వెంకటేశ్వర్లు, సాగిన రాములు,అచ్చియ్య పాల్గొన్నారు.

14న వీరభద్రేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ట


నూతనంగా నిర్మించిన ఆలయ భవనం

అడ్డతీగల: భద్రకాళి సమేత వీరభద్రేశ్వర స్వామి విగ్రహాన్ని ఈ నెల 14న ప్రతిష్ఠించనున్నట్టు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకట రామయ్య తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయ భవనంలో ఆరోజు ఉదయం భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు చెప్పారు.

నేడు నాలుగు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

అడ్డతీగల: విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నాలుగు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ యూసఫ్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేస్తామన్నారు. దీని వల్ల అడ్డతీగల,రాజవొమ్మంగి,గంగవరం,వై.రామవరం మండలాల్లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన


కృష్ణవరరంలో ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

ఎటపాక: అవినీతికి పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం కృష్ణవరం గ్రామంలో ఉపాధి కూలీలు ఆందోళన చేశారు. పక్క పంచాయతీకి చెందిన కూలీలు గ్రామంలో ఉపాధి పనులు చేయకుండానే చేసినట్టుగా చూపి మస్టర్లు వేసి, వేతనాలు తీసుకున్నారని ఆరోపించారు. ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఏపీవో గ్రామానికి చేరుకుని కూలీలతో మాట్లాడి దీనిపై విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. వేరే పంచాయతీలోని కూలీలు కృష్ణవరం గ్రామం చెరువులో పనులు చేసిన మాట వాస్తవమేనని, సరిపడా నిధులు లేక పోవడంతోనే వేరే పనుల్లో మస్టర్ల వేసి, వేతనాలు చెల్లించినట్టు ఏపీవో రాఘవయ్య తెలిపారు.

కార్చిచ్చుల ముప్పుపై అవగాహన


వేములోవలో కళాజాతలో ప్రసంగిస్తున్న కరుణాకర్

గంగవరం : కార్చిచ్చుల వల్ల జరిగే నష్టాలపై కళాజాతల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్టు ఫోక్స్ పేట రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. కార్చిచ్చుల వల్ల జరిగే నష్టం, అగ్నిప్రమాదాల నిర్మూలన, అదుపునకు తీసుకోవలసిన జాగ్రత్తలపై గురువారం రాత్రి లోతట్టు గిరిజన గ్రామమైన వేములోవలో రాజమండ్రి విభూతి ప్రదర్శన కళాకారులు నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ అడవుల రక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ నూకరాజు దొర, ఎఫ్‌బీవోలు వరలక్ష్మి, మనోహర్, జగదీశ్,పద్మ,జు దుర్గ శ్రీను, ప్రశాంత్ కుమార్,అరుణ శ్రీ పాల్గొన్నారు.


చింతపల్లి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


రాజేంద్రపాలెంలోప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


కూనవరం పాత మసీదులో ..

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు


జి.మాడుగుల మసీదులో..


రాజవొమ్మంగి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

చింతపల్లి రూరల్: ముస్లింలు రంజాన్ పండగను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక మసీదులో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు (ఇమామ్) మహ్మద్ ముజీబ్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతన కలయికే రంజాన్ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మీరా,మాజీ అధ్యక్షుడు నాగూర్ షరీఫ్, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం బిలాల్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనల్లో నాగూర్, పాదుషా, ఇమామ్, బషీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక రెహమానియా మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ముస్లింలు మసీదుకు చేరుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. హుస్సేన్ ఖురాన్ చదివి వినిపించారు. పేదలకు అన్నదానం చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన పాయసాన్ని స్నేహితులకు, బంధువులకు పంచిపెట్టారు.

కూనవరం: మండలంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూనవరంలోని పాత మసీదు, బస్‌స్టాండ్ సెంటర్ వద్ద గల మసీదుతో పాటు పోచవరం కాలనీ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: స్థానిక మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజ్‌చేసి, ఒకరినొకరు రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కుటుంబసభ్యులు,బంధుమిత్రులతో విందుల్లో పాల్గొన్నారు.


సీలేరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

సీలేరు: రంజాన్ సందర్భంగా స్థానిక మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సీలేరు వీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీతోనే పోలవరం నిర్వాసితులకు మేలు

ఎమ్మెల్సీ అనంత బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత బాబు

దేవీపట్నం : పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే న్యాయం జరిగిందని ఎమ్మెల్సీ అనంత బాబు అన్నారు. మండలంలోని గంగంపాలెం, ములపాడు, సీతారాం, నాగులపల్లి, పెనీకలపడు నిర్వాశిత కాలనీల్లో, పోతవరం, దేవారం, పోతుకొండ, సరభవరం తదితర గ్రామాల్లో గురువారం ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ ప్రారంభించి 15 ఏళ్లు పైబడుతున్నా గతంలో నిర్వాసితులను ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే 2019 నుంచి నిర్వాసితులకు పునరావాస కాలనీలు నిర్మించి, మౌలిక వసతులు ఏర్పాటు చేశామని, నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించమన్నారు. మిగిలిన సమస్యలు రానున్న కాలంలో పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. జాతీయ ప్రాజెక్ట్ కావడం వల్ల కేంద్రం నుంచి నిధులు రావాల్సి ఉందని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా ఎటువంటి అవినీతికి తావు లేకుండా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. కొండపాడు సాగు చేసుకుంటున్న గిరిజనులకు పట్టాలు అందించి, తక్షణం రైతు భరోసా పథకం మంజూరు చేసినట్టు చెప్పారు. గతంలో పథకాలు, సర్టిఫికెట్‌లు కావాలంటే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పరిపాలన చేరువ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. రానున్న కాలంలో మరింత సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డిని సీఎం చేయాలని కోరారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నాగులపల్లి ధనలక్ష్మిని, ఎంపీగా తనుజా రాణిని గెలిపించేందుకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎంపీపీ కుంజం మురళి, జడ్పీటీసీ సిరసం సత్యవేణి. పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు.

చిత్తులాటపై దాడి - 16 మంది అరెస్టు

రాజవొమ్మంగి : స్థానిక శాంతినగర్ శివార్లలో చిత్తులాటపై స్థానిక పోలీసులు గురువారం దాడి చేసి, 16 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4,570 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ వెంకయ్య తెలిపారు. కోడిపందాలు, జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: మండల కేంద్రం అరకులోయలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి మత్స్యలింగం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే స్ఫూర్తితో అందరూ ముందడుగు వేయలన్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజారమేష్, వైస్ ఎంపీపీ రామన్న, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు ఆనంద్‌కుమార్, సత్రుగున్, రామచందర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు శెట్టి అప్పాలు, కమిడి అశోక్‌కుమార్, తిరుపతి, విజయ్‌కుమార్, పరశురాం, నర్సింగ్, బాలరాజు, రాజ్‌కుమార్, అప్పలస్వామి, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలే సేవలు చిరస్మరణీయం

సీలేరు: వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని, ఆయన సేవలు చిరస్మరణీయమని సూపరింటెండింగ్ ఇంజినీర్ కె.వి.ప్రశాంత్ కుమార్ తెలిపారు. బీసీ వెల్ఫేర్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ కె.వి.ప్రశాంత్ కుమార్, ఈఈ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ పూలే ఆశయసాధనకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, జెన్‌కో కార్మికులు వై.దాగ్రాజు, ఈ.వి.వి.సత్యనారాయణ, సీఐటీయూ కాంట్రాక్ట్ కార్మిక నాయకులు బి.లక్ష్మణ్,విష్ణు ,జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.


సీలేరులో జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెన్ ఇంజినీర్లు, కార్మికులు

షిర్డీ సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో బాబా

రాజవొమ్మంగి : స్థానిక షిర్డీ సాయి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. మధ్యాహ్న హారతి అనంతరం భజనలు చేశారు. ఈ సందర్భంగా కోరుకొండ గ్రామానికి చెందిన మిలటరీ రిటైర్డ్ ఉద్యోగి కోన నాగ సత్యనారాయణ, లక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్టు ఆలయకమిటీ తెలిపింది.


ఆలయంలో నిర్వహించిన అన్నసమారాధన

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ హోరు

వైఎస్‌సీపీ నాయకులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పథకాలను వివరిస్తూ .. ఇవి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమని, ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, పార్టీ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.

ఇంటింటికీ వెళ్లి ప్రచారం


డి.చింతలవీధిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు, నాయకులు


కింటిబడిలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న నాయకులు


డుంబ్రిగుడ మండలంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కొట్నాపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

హుకుంపేట: జగనన్న మళ్లీ అధికారంలో వస్తేనే గ్రామాల్లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎంపీపీ కూడా రాజుబాబు కోరారు. మండలంలోని దాలిగుమ్మడి, డి.చింతలవీధి గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతాల్లో ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఎం.విశ్వేశ్వరరావు, నాయకులు నైని సత్తిబాబు, వెంకట్,నాగేష్, గడ్డంగి సూరిబాబు, కృష్ణమూర్తి, సత్తిబాబు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలో గన్నెల పంచాయతీ మారుమూల గ్రామాలైన కింటిబడి, సభక, చిల్లిబడి, డప్పుగుడ గ్రామాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో అద్భుతమైన పాలన అందించారని, అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేశారని చెప్పారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నను రెండో సారీ సీఎంను చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, వైస్ సర్పంచ్ మల్లేష్, పార్టీ సీనియర్ నాయకులు హరి, సుమన్, తిరుపతి, బాలరాజు, విజయ్, సోనియా, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ(అరకులోయటౌన్): డుంబ్రిగుడ మండలంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం గెలుపే లక్ష్యంగా పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో పలు పంచాయతీల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పాపారావు,సర్పంచ్ లచ్చు, సీనియర్ నాయకులు సింహాచలం, కృష్ణారావు, మహాదేవ్, వినోద్, లవకుశ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని ఆపార్టీ గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్ కోరారు. పార్టీ మండల నాయకులు దేవరాపల్లి పంచాయతీ కొట్నాపల్లిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బోయినకుమారి, ఎంపీటీసీ పోతురాజు, సర్పంచ్ కృష్ణవంశి, మాజీ జడ్పీటీసీ మత్యరాజు నాగమణి, శ్రీరాములు గృహసారథులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసుల ప్రచారం


యువతకు వాలీబాల్‌కిట్లు అందజేస్తున్న గూడెంకొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి


ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామారావు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న గుర్తేడు ఎస్ఐ సాయికుమార్

గూడెంకొత్తవీధి: సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని గూడెంకొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి తెలిపారు. ప్రత్యేక గ్రేహౌండ్స్ బలగాలతో కలిసి ఆంధ్రా, ఒడిశా సరిహద్దుప్రాంతాలైన డబుల్‌పహాడ్, బంగారుసుధా, కట్టగుడ, అమ్మవారి దారకొండ పంచాయతీల్లోని మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ గిరిజన యువతతో మాట్లాడారు. మావోయిస్టుల హెచ్చరికలకు భయపడనవసరం లేదన్నారు. పోలీసులు రక్షణ కల్పిస్తారని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈసందర్భంగా అక్కడ గ్రామాల్లోని యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు మందులు, చిన్నారులకు చాక్‌లెట్లు పంపిణీ చేశారు.

ఎటపాక: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎటపాక సీఐ డి.రామారావు కోరారు. గురువారం గౌరీదేవిపేటలో ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో ఎటు వంటి ఘర్షణలకు తావులేకుండా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని మండలంలోని గుర్తేడు ఎస్ఐ పి.సాయికుమార్ తెలిపారు. ఎడ్లకొండ గ్రామస్తులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించి, ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఎవరి ప్రలోభాలకు తలొగ్గకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం ఆ గ్రామ ప్రధాన రహదారిలో అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు.

మారుమూల గ్రామాలకూ రోడ్డు సదుపాయం


నేరెళ్లబందలో గిరిజనులతో సమావేశమైన ఎంపీపీ బోయినకుమారి

గూడెంకొత్తవీధి: మారుమూల గిరిజన గ్రామాలకు సైతం రహదారులు నిర్మించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయినకుమారి అన్నారు. నేరెళ్లబంద నుంచి పెద్దసాగుల గ్రామం వరకు నిర్మిస్తున్న తారురోడ్డు పనులను మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, లక్కవరపేట సర్పంచ్ వీరేంద్రప్రసాద్‌ల ఆధ్వర్యంలో గురువారం పార్టీనాయకులు, కార్యకర్తలు పరిశీలించారు. అనంతరం అక్కడ గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా ఈ ఐదేళ్లలో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయని చెప్పారు. వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, ఎంపీటీసీ నాగమణి, కృష్ణమూర్తి, గిరిప్రసాద్, సర్పంచ్‌లు కృష్ణవంశీ గంగదొర పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు


పెద్దపైపు(ఊటగెడ్డ)ను పరిశీలిస్తున్న అధికారులు

చింతపల్లిరూరల్: మండల కేంద్రం చింతపల్లిలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు అన్ని వేళలా నీరు అందుబాటులో ఉండే చింతపల్లి పెద్దపైపు(ఊటగెడ్డ)ను తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో వీరసాయిబాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం సమయంలో పెద్దపైపు నీళ్లను స్థానికులు వినియోగించుకునేలా, రాత్రి సమయంలో సమీపంలో ఉన్న బావుల్లో నీటిని డంప్ చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. డంప్ చేసిన నీటిని మరుసటి రోజు శుద్ధి చేసి ట్యాంకర్ల ద్వారా వీధుల్లో సరఫరా చేయాలని నిర్ణయించినట్టు వారు చెప్పారు. ఈ మేరకు ఆర్‌డబ్ల్యూఎస్,పంచాయతీ అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. మరో రెండు రోజుల్లో చింతపల్లిలో నీటి సమస్య కొంతమేరకు తీర్చగలుగుతామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుక్మాంగరాజు,ఏఈ స్వర్ణలత,కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో ఎన్నికలు

గొలుగొండ: శాంతియుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. రావణాపల్లి చెరువు వద్ద ఉపాధి హామీ కూలీలతో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి వివాదాలకు పాల్పడవద్దన్నారు. ఎన్నిలకు సజావుగా నిర్వహించేందుకు గ్రామాల్లో ప్రజలు సహృద్భావంతో మెలగాలని సూచించారు. ఎన్నికల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రతి గ్రామంలో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు.

వైభవంగా ఎరుకుమాంబ తీర్థం


ఎరుకుమాంబ ఆలయం వద్ద అన్నసమారాధన

మాడుగుల రూరల్: వీరవల్లి గ్రామ శివారు ఎరుకువాడ మెట్ట పక్కన్న వెలిసిన ఎరుకుమాంబ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన ఎడ్లబళ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇందులో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.